తగ్గనున్న మిర్చి సాగు విస్తీర్ణం

- మిర్చి సాగులో పెరిగిన పెట్టుబడులు
- కూటమి ప్రభుత్వంలో మిర్చికి లభించని మద్దతుధర
- పత్తి సాగుపై రైతుల మొగ్గు



పత్తి విత్తనాలు నాటిన పొలం



షేడ్‌నెట్‌లో పెంచుతున్న మిరపనారు (ఫైల్)

వత్సవాయి/పెనుగంచిప్రోలు: వాణిజ్య పంటలలో ప్రధానమైన మిర్చి పంట సాగుపై రైతులు విముఖత చూపిస్తున్నారు. మిర్చి సాగు చేపట్టాలంటేనే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో మిర్చి సాగుకు రైతులు వెనకంజ వేస్తున్నారు. దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు అమాంతం పెరగడం, ఎరువులు, పురుగుమందులు కూలీల ఖర్చులు కూడా రాక పోవడంతో మిర్చి పట్ల రైతులు ఆసక్తి చూపడం లేదు. రైతులు ప్రత్యామ్నాయంగా పత్తిపంట వైపు దృష్టి సారిస్తున్నారు.

మిర్చికి రూ.లక్షల్లో పెట్టుబడులు

ఎకరం మిర్చి పంట సాగుచేయాలంటే కౌలుతో కలుపుకుని సుమారు రూ.లక్షకు పైగా పెట్టుబడులు అవుతున్నాయి. పొలాన్ని దుక్కి దున్ని విత్తనం వేసిన నాటి నుంచి కాయలు కోసి అమ్ముకునే వరకు అనునిత్యం పెట్టుబడి పెట్టాల్సిందే. మిర్చి పంటకు ఐదు విడతలు నీరు పెడితేనే ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ఎరువులు, పురుగుమందులు ధరలు కూడా ఆకాశంలో ఉన్నాయి. ఎకరాకు 25 నుంచి 30 మందు కట్టలు పడుతుండగా 300 నుంచి 350 దినాల కూలీఖర్చులు చెల్లించాలి. ఇంత కష్టపడి పంట పండించినా గిట్టుబాటు ధర లేకపోవడంతో మిర్చి రైతులు దెబ్బతింటున్నారు. గత సీజన్‌లో ఎకరం మిర్చి పంట సాగుచేసిన రైతుకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టాలు వచ్చినట్లు చెబుతున్నారు. గతేడాది నియోజకవర్గంలో మిర్చి పంట 13,750 ఎకరాలలో సాగుచేయగా అది ప్రస్తుతం తగ్గనుంది.

పత్తిపంట వైపు రైతుల చూపు ..

మిర్చి పంట ఆశాజనకంగా లేకపోవడంతో నియోజకవర్గంలోని రైతులు ప్రత్యామ్నాయంగా పత్తిపంట వైపు అడుగులు వేస్తున్నారు. గత ఖరీఫ్‌లో పత్తి నియోజకవర్గంలో 18,500 ఎకరాల్లో సాగుచేయగా అది పెరిగే అవకాశం ఉంది. పత్తికి పెట్టుబడి తక్కువగా ఉండడం, రెండో పంటగా మొక్కజొన్న సాగు చేయడం, సాగునీరు పెట్టే పని కూడా లేకపోవడంతో రైతులు పత్తిపంట వైపు మొగ్గు చూపుతున్నారు.

షేడ్‌నెట్లలో పెంచుతున్న మిరపనారు

మక్కపేట, వత్సవాయి, చిల్లకల్లు గ్రామాల్లో షేడ్‌నెట్లలో మిరపనారు పెంచే నర్సరీలు ఉన్నాయి. మిరప విత్తనం రకాన్ని బట్టి నారు ధరలు ఉంటాయి. ఒక్కొక్క మిరప మొక్క ధర రూపాయి నుంచి మొదలవుతుంది. మిరపసాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గుతుండటంతో ప్రస్తుతం షేడ్‌నెట్ నిర్వాహకులు కూడా మిరపనారును అధిక మోతాదులో పెంచేందుకు వెనకాడుతుండటం గమనార్హం.

రైతులకు ప్రభుత్వ మద్దతు కరువు..

గతేడాది మిర్చి దిగుబడులు బాగున్నా మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అంతకుముందు ఏడాది క్వింటా మిర్చి ధర రూ.22వేల నుంచి రూ.24వేల వరకు పలుకగా, ఈసారి రూ.12వేలు కూడా పలకకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చిసాగుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో కూడా ఇదే ధరలు కొనసాగితే మిర్చి కోత ఖర్చులు కూడా రావని చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి మిర్చి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల సంఖ్య తక్కువగా ఉందని విత్తనాల దుకాణ డీలర్లు కూడా చెబుతున్నారు. దీంతో మిర్చి విత్తనాల కోసం పెట్టిన పెట్టుబడులైనా వస్తాయో?రావో?నని డీలర్లు సైతం ఆందోళన చెందుతుండటం మిర్చిసాగు పరిస్థితికి అద్దం పడుతోంది.

నేటికీ విద్యార్థులందరికీ అందని పాఠ్యపుస్తకాలు : ఎస్‌ఎఫ్‌ఐ



నందిగామ రూరల్: పాఠశాలలు ప్రారంభమై 15రోజులు దాటుతున్నా విద్యార్థులకు నేటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను ప్రభుత్వం అందించలేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను త్వరితగతిన అందజేయాలని కోరుతూ తహసీల్దార్ సురేష్‌బాబుకు గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోపీనాయక్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన బకాయిలను విడుదల చేయటంతోపాటు జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు సైతం విద్యా, వసతి దీవెన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠ్యపుస్తకాలు, యూనీఫాం అందించడంతోపాటు నాడు-నేడు, నాబార్డు ద్వారా విద్యా సంస్థల్లో చేపడుతున్న పనులను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షేక్ ఖాజా, హసన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెయిన్ బజార్‌లో చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

నందిగామరూరల్: నందిగామ పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని చెత్తకుండీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించని వైనంపై 'చెత్తమయం' శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ లోవరాజు స్పందించారు. మెయిన్‌బజార్‌లోని చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ పట్టణంలోని ఆయాప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్తకుండీల వద్ద రోజూ చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రోడ్లపై చెత్తను పడేసే వ్యాపారులకు నోటీసులు ఇస్తామన్నారు. అనంతరం మెయిన్‌బజార్ నుంచి శివాలయం వరకు జరుగుతున్న బ్రషింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శిగా నంబూరి రవి



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నంబూరి రవి నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సిఫార్సుతో నంబూరి రవిని నియమించారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. నంబూరి రవికి నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావుతోపాటు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు

రేషన్ పంపిణీ ప్రక్రియ పరిశీలన



నందిగామటౌన్: దివ్యాంగులు, 65ళ్ల పైబడిన వృద్ధులకు ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోగా రేషన్‌కార్డు కలిగిన దివ్యాంగులు, వృద్ధులందరికీ నూరు శాతం సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడినా, సక్రమంగా పంపిణీ చేయకపోయినా సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ పంపిణీని పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీవో వెంట కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లు అందజేత



నందిగామటౌన్ : మెప్మాలో ఇక నుంచి డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు ప్రభుత్వం నుంచి మంజూరైన ట్యాబ్‌లను మున్సిపల్ కమిషనర్ లోవరాజుతో కలిసి గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని మరింత పారదర్శకంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు యేచూరు రాము, రాటకొండ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్‌లో 145.6 మి.మీ వర్షపాతం

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో బుధవారం 145.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డివిజినల్ ఉపగణాంకాధికారి ప్రసాద్ తెలిపారు.జగ్గయ్యపేట మండలంలో అత్యధికంగా 57.2 మి.మీ, నందిగామ మండలంలో 15.6 మి.మీ, కంచికచర్ల మండలంలో 7 మి.మీ, చందర్లపాడు మండలంలో 11.2 మి.మీ, వీరులపాడు మండలంలో 6.2 మి.మీ, వత్సవాయి మండలంలో 29.2మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆయన వివరించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పేటలో మాట్లాడుతున్న జడ్జి హిమబిందు



పేటలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం, పోలీసు అధికారులు, విద్యార్థులు



నందిగామలో ర్యాలీ చేస్తున్న డీసీపీ, ఏసీపీ, ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



పెనుగంచిప్రోలులో ర్యాలీలో పాల్గొన్న ఏఎస్ఐ, విద్యార్థులు



నందిగామ జీడీఎం కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి సత్యలక్ష్మీప్రసన్న

జగ్గయ్యపేటఅర్బన్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా మెలగాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.హిమబిందు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సీతారామపురంలోని జేఆర్‌సీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి హిమబిందు మాట్లాడుతూ విద్యార్థులు, యువత దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం జేఆర్‌సీ యాజమాన్యం జడ్జి హిమబిందును ఘనంగా సత్కరించారు.

పేటలో అవగాహన ర్యాలీ..

జగ్గయ్యపేట అర్బన్: యువత మాదకద్రవ్యాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచిస్తూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం జగ్గయ్యపేట పట్టణంలోని చిల్లకల్లు రోడ్డు ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుంచి రైతుబజారు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజాన్ని మేల్కొలిపేలా అందరికీ అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, రూరల్ డీసీపీ కేఎస్.మహేశ్వరరావు, ఏసీపీ తిలక్, పేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, సీఐ పి.వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్ఐ జి.రాజు, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎస్ఐలు సూర్యశ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, అర్జున్, కౌన్సిలర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, విద్యార్థులు, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు సమాజానికి చేటు

నందిగామటౌన్: మాదకద్రవ్యాల కారణంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని విజయవాడ డీసీపీ ఉమామహేశ్వరరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నందిగామ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసై విద్యార్థులు, యువత పెడదోవ పడుతున్నారన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని, రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించి భవిష్యత్ తరాలకు మంచి సమాజాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, ఏసీపీ తిలక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణి శ్రీనివాస్, పోలీసులు, కూటమి నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నందిగామ ఆర్డీవో కార్యాలయంలో..

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో బాలకృష్ణ, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీడీఎంఎం కళాశాలలో..

నందిగామ రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్‌జడ్జి సత్యలక్ష్మీ ప్రసన్న సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామలోని జీడీఎంఎం కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు తీసుకుంటే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంపై మాదకద్రవ్యాలు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ మాదకద్రవ్యాల కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. యువత చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా సక్రమమైన మార్గంలో నడుచుకుంటేనే సమాజం అభివృద్ధి పథంలో సాగుతుందని వివరించారు. అనంతరం మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు సహకరిస్తామంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సీనియర్ కౌన్సిల్ చావలి సాంబశివరావు, కళాశాల చైర్మన్ జీవీ ప్రసాదరావు, న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, అద్దంకి మణిబాబు, యరగొర్ల రామారావు, దాదాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించాలని ఎస్ఐ అనిల్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరులపాడులో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. యువత, విద్యార్థులతోపాటు ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాల నియంత్రణకు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామరూరల్: మండలంలోని చందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, అంగనవాడీ కార్యకర్తలతో కలిసి మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా అందరూ పనిచేయాలని పెనుగంచిప్రోలు ఏఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా యువత మత్తు జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండ్లచెరువు పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ



లింగాల(వత్సవాయి): గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న గుండ్ల చెరువు ఆయకట్టుకు నీరందించే చర్యగా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ కోరారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి గురువారం ఆయన గుండ్ల చెరువు ఆయకట్టు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు ఆయకట్టుకు గతంలో సంవృద్ధిగా సాగునీరు సరిపోలేదని రైతులు తెలిపారని చెప్పారు. ఈ సీజన్‌లో ముందుగానే చెరువును నింపి ఆయకట్టు పొలాలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ టి.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లంతా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భవనాల పనులకు కూటమి గ్రహణం



షేర్‌మహ్మద్‌పేటలో పూర్తికాని సచివాలయ భవనం పనులు



బలుసుపాడులో సచివాలయం, రైతుభరోసా కేంద్రాల చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

జగ్గయ్యపేట: మండలంలోని పలు సచివాలయ, రైతుసేవా కేంద్రాల భవన నిర్మాణ పనులను పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లోని సచివాలయాలను అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తుండటంతో ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

మండలంలోని షేర్‌మహ్మద్‌పేట సచివాలయం-1, బలుసుపాడులో పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో సచివాలయ భవనం, రైతుసేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టారు. ఈక్రమంలో ఏడాది కిందట సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా భవనాల పనులను పూర్తిచేయడంలో ఏడాదిగా తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోంది.

ఇబ్బందుల్లో ఉద్యోగులు..

షేర్‌మహ్మద్‌పేట-1 సచివాలయ భవనం పనులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాదాపు 90 శాతం పనులు పూర్తిచేసింది. మిగిలిన పదిశాతం పనులను పూర్తిచేయడం మాత్రం కూటమి ప్రభుత్వానికి ఏడాదిగా చేతకావడం లేదనే విమర్శలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. ఇక బలుసుపాడులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను ఒకే ఆవరణలో చేపట్టగా, ఎన్నికల నాటికి సచివాలయ భవనం పనులు 95శాతం పనులు పూర్తయ్యాయి. ఐదు శాతం పనులు చేయకపోవడంతో భవనం వినియోగంలోకి రాకపోగా, ఆ ప్రాంగణమంతా చిట్టడివిని తలపిస్తుంది. రైతుసేవా కేంద్రం పనులు కూడా ఏడాదిగా అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. సచివాలయ భవన నిర్మాణాలు పూర్తిగాకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆయా ప్రభుత్వ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

మండలంలో అసంపూర్తిగా మిగిలిన ఆయా సచివాలయ, రైతుసేవా కేంద్రం, విలేజ్ క్లీనిక్‌ల భవన నిర్మాణ పనులపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. నిధులు మంజూరు కాగానే ఆయా పనులను పూర్తిచేసి భవనాలను వినియోగంలోకి తెస్తాం.

– శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి డీఈ

వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలో వేంచేసియున్న హరిహర కోటిలింగ మహాక్షేత్రంలోని వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు తేజశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు అమ్మవారికి మూలమంత్ర హోమ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకుడు తెలిపారు. కార్యక్రమంలో ఈవో హరిదుర్గానాగేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు సూచనలు

నందిగామరూరల్: రైతులు లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం సూచించారు. మండలంలోని కంచల గ్రామంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్తాధ్వర్యంలో గురువారం ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ మేళాను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని, రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం పతంజలి ఫుడ్స్ డీజీఎం వీరేంద్రచౌదరి మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపి పీడీ సుభాని, డీహెచ్‌వో బాలాజీకుమార్, ఉద్యానశాఖాధికారి వర్ధిని, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.